పాడిరైతుల సంక్షేమానికి పెద్దపీట : 'చింతల'

ప్రజాశక్తి - కలికిరి

పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం గుండ్లూరులో నిర్వహించిన గడపగడప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకొని, పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువుల బీమా, గడ్డి విత్తనాలు, నట్టల నివారణకు, గొర్రెలకు టీకాలు వేయడం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ, పాడి రైతుకు అనేక రకాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించడం, గడ్డి విత్తనాలు పంపిణీ చేయడం, బీమా సౌకర్యాన్ని కల్పించడం, ఎక్కడ ఏ ప్రభుత్వం ఎన్నడూ చేయని విధంగా పశువులకు అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పశువుల వైద్యుడు గిరినాథ్‌రెడ్డి, జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.హరి, ఎంపిటిసి రవిరెడ్డి, మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, ఎంపిడిఒ గంగయ్య, తహశీల్దార్ భాగ్యలత, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి

- సిడిపిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీల నిరసన
- అధికారులకు వినతిపత్రాల సమర్పణ
- 25 లోపు బిల్లులివ్వకపోతే నిరవధిక ధర్నా

రైల్వేకోడూరు : సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అంగన్వాడీ సమస్యల పరిష్కరించాలని, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తానే, తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకొని, నేడు నాలుగేళ్ల అవుతున్న అమలు చేయలేదని విమర్శించారు. కనీస వేతనాలు చట్ట ప్రకారం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, 2018లో వర్కర్‌కి రూ.1500, ఆయాకి రూ.750, మినీ వర్కర్‌కు రూ.1200 పెంచుతున్నట్లు ప్రకటించి నేటికీ అమలు చేయలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోషపూరిత వాగ్దానాలతో మోసం చేస్తున్నారని విమర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు సక్రంగా జీతాలు చెల్లించడం లేదని, ప్రతినెల ఐదవ తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2017 నుండి ఆరు సంవత్సరాల నుండి టిఎ, డిఎ చెల్లించలేదని తెలిపారు. అధికార పార్టీ రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎన్.రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాధాకుమారి, ఉపాధ్యక్షులు పిసుధామణి, వనజ కుమారి, కోశాధికారి పద్మావతి, దుర్గా, శిరీష, నిర్మలా, సుజాత, ఇందిరా, కుమారి, కౌసల్య, మైథిలి, వాణి, స్వర్ణ, సునీత, శ్రీదేవి, మాధవి సుబ్బలక్ష్మి, రోజా, రెడ్డమ్మ, రాధా, మండల సిఐటియు కోశాధికారి హరిఎనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.జాన్ ప్రసాద్ పాల్గొ న్నారు. అనంతరం సిడిపిఒ సౌభాగ్యమ్మకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

మదనపల్లె అర్బన్: అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు అరికట్టాలని పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ యూనియన్ మదనపల్లె ప్రాజెక్టు అధ్యక్షులు డియర్ మధురవాణి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ నాయకులు వేధింపులు అరికట్టాలని, కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ సమస్య అంగన్వాడీలకు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అంగన్వాడీలకు సరఫరా చేసే స్టాకు సరిపడా ఇవ్వాలని, తూకాలు సరిగా ఉండాలని, రిటైర్డ్ అంగన్వాడీ హెల్పర్లకు బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఒ సుజాతకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.రాజేశ్వరి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల జీతాలు బిల్లులు ఈ నెల 25 లోపు ఇవ్వకపోతే నిరవధిక ధర్నా చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు వి.సిద్దమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఫయాజ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసి ప్రయివేటీకరణ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాయని తెలిపారు. బడ్జెట్ తగ్గించడం, జీతాల బిల్లులు సకాలంలో మంజూరు చేయకపోవడం, కొత్త కేంద్రాలు కేటాయించకపోవడం జరుగుతోందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి ప్రాజెక్టులో ఐదు నెలలుగా సెంటరు అద్దెలు ఇవ్వకపోవడంతో భవన యజమానులు బయటకు గెంటివేస్తున్నా అధికారులకు, పాలకులకు చీమ కుట్టినట్లు లేదని వాపోయారు. రెండు నెలలు జీతాలు, మూడు నెలలు కూరగాయల, గ్యాస్ బిల్లులు ఇవ్వలేదన్నారు. దాదాపు 90 మందికి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్రమైన అప్పులతో, తీవ్రమైన అవమాన భారంతో అల్లాడుతున్నారని వాపోయారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు ఇవ్వాలని తెలిపారు. ధర్నా అనంతరం సిడిపిఒకు నిరవధిక ధర్నా నోటీసును అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ఖాజాబి, విజయ, నాగమణి, కవిత, అరుణ, తులసి, పద్మజ, జయ అంజలి, ఉమా శంకరమ్మ, జలజ ప్రవీణ, ఇందిర, శైలజ పాల్గొన్నారు.

రాయచోటి : సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె : నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : 'సిటు'

ప్రజాశక్తి - రాజంపేట

మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ ఎదురుగా రాష్ట్ర కమిటి పిలుపు మేరకు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకి సిపిఎస్ రద్దు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్‌లకు రూ.18,500 జీతం వర్తింపచేయడంతో పాటు ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క ఉద్యోగ, కార్మికులందరికీ అధికారులే అర్హత కల్పించాలన్నారు. మా ప్రభుత్వం వస్తే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కార్మికులను పర్మినెంట్ చేస్తానని ముఖ్యమంత్రి జగన్ గతంలో మాట ఇచ్చారని తెలిపారు. నేడు మునిసిపల్ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల తరుణంలో మునిసిపల్ కార్మికులు తమ సత్తా ఏమిటో చూపుతారని ఈ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చెబుతారని ఆ పరిస్తితి తెచ్చుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఒబయ్య, ప్రసాద్, రవి శంకర్, సుబ్బారాయుడు, కె.సుబ్బమ్మ, రమణమ్మ,నాగరాజమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ :'మేడా'

విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహర్దశను తీసుకొచ్చారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆణిముత్య విద్యార్థులకు ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డితో కలసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ప్రథమ బహుమతికి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, పదివేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు చొప్పున విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పిల్లల పాఠశాలలను ముఖ్యమంత్రి ఎంతో అభివృద్ధి చేశారని, ప్రభుత్వపాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే పుట్టి పెరిగిన గ్రామానికి చెందిన ఓ విద్యార్థి సభా సమావేశంలో ఆంగ్లంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా బోధనకు పిల్లల భవిష్యత్తుకు అభివృద్ధి చేస్తున్నారని చెప్పడంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, వైసిపినాయకులు ఎల్లారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శరత్‌కుమార్‌రాజు, సర్పంచ్ రాజా, వైసిపి నాయకులు విశ్వనాథరాజు ఎంపిటిసి మధుబాబు, వైస్ సర్పంచ్ సాంబయ్య, పేట వార్డ్ కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, విశ్వనాథ్‌రెడ్డి, మురళి రెడ్డి, దండుగోపి, పెంచలయ్య, శంకరయ్య, వైసిపి మహిళా నాయకురాలు మిరియాల సురేఖ పాల్గొన్నారు.

వయోవృద్ధులపై వేధింపులు మానుకోవాలి

- సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వయో వృద్ధులపై వేధింపులు మానుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక జిఆర్‌టి ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ, కార్యదర్శి వి.ఎం.నాగరాజు, కోశాధికారి ఉస్మాన్ సాహెబ్, గౌరవాధ్యక్షులు కె.మునిరత్నమయ్య, ఉపాధ్యక్షులు జగన్ మోహన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం నిర్వహించారు. వృద్ధులపై వేధింపులు నివారించాలనే నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ తరిగిపోతున్న మానవ, నైతిక విలువలు, కుటుంబ బాంధ్యవ్యాలు కనుమరుగవ్వటం, ఆధునిక జీవన శైలి, వేధింపులకు గల కారణాలు అందులో రకాలు గురించాలని పేర్కొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వృద్ధులను శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక, హక్కుల ఉల్లంఘన, పద్ధతి ప్రకారం వేధించటం జరుగుతోందని తెలిపారు. వృద్ధులపై వేధింపులు, చట్టపరంగా ఉన్న రక్షణ గురించి సమగ్రంగా వివరించారు. గౌరవ అధ్యక్షులు ముని రత్నమయ్య మాట్లాడుతూ వృద్ధులపై వేధింపులు మానాలన్నారు. కార్యదర్శి నాగరాజు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ వృద్ధులపై వేదింపులకు పాల్పడితే వారికున్న రక్షణ చట్టాల గురించి అవగాహన పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, మనోహరమ్మ, సరస్వతమ్మ, రామచంద్రయ్య, కృష్ణకుమార్, కృష్ణమూర్తి, ఉస్మాన్, జగన్ మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్న అబ్దుల్ కలీమ్

ఉర్దూ భాషాభివృద్ధికి సిఎం ప్రాధాన్యత

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం స్థానిక నాయక్‌వీధిలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉర్దూ భాషను రెండో అధికార భాషగా అమలు చేస్తోందని, నాడు-నేడు పథకంలో పలు ఉర్దూ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కుటుంబంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు ఏ విధంగా శ్రద్ధ తీసుకుంటారో అదేవిధంగా సిఎం విద్యార్థుల విద్యాభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ విద్యారంగంలో అనేక సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసు కొచ్చారన్నారు. విద్యార్థుల బూట్లు, బట్టలు మొదలుకొని ఆహారం వరకు నాణ్యత పట్ల స్వయంగా సిఎం శ్రద్ధ తీసుకొని అందజేయడం జరుగు తుందన్నారు. గత ప్రభుత్వాల్లో విద్యార్థులకు ఇలాంటి పథకాలు కల్పించలేదని, విద్యార్థుల బాగోగులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని లక్ష్యాలు సాధించినప్పుడే సిఎంఅమలు చేస్తున్న పథకాలకు, ఆశయాలకు సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రియాజ్ సాహెబ్, మహబూబ్ బాషా, అమీర్ హుస్సేన్ సాహెబ్, ఆబిద్ హుసేన్, సాధిక్, షాహెద్, మహమ్మద్ అలీ, జవహర్, సయ్యద్ బాషా, సైఫుల్లా, జంషీద్, ఉపాధ్యాయులు జమీల్ అహ్మద్, అల్లాబక్షు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల మరణాలకు అతిసార ఓ కారణమే : డిఐఒ

ప్రజాశక్తి-పీలేరు

చిన్నపిల్లల మరణాలకు అతిసార వ్యాధి కూడా ఓ కారణమే అని అన్నమయ్య జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. గురువారం పట్టణంలోని ముత్తరాసువీధిలోని అంగన్వాడీ కేంద్రంలో రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిర్వహించిన ఉధ ృత అతిసార నియంత్రణ పక్షోత్సవ కార్యక్రమాన్ని డిఐఒ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లల్లో సంభవిస్తున్న మరణాలకు నీళ్ల విరోచనాలు కూడా ఓ ముఖ్య కారణం కావడంతో తల్లులకు నీళ్ల విరోచనాలు, ప్రమాదకర లక్షణాలు, ఓఆర్ఎస్ కలుపుకునే విధానం, ఓఆర్ఎస్ తాగించే విధానం, చేతులు శుభ్రపరుచుకోవడం, మొదలగు విషయాల గురించి తల్లులకు అవగాహనా కల్పించాలని చెప్పారు. తద్వారా పిల్లల మరణాలును నియంత్రించ వచ్చని చర్చించారు. డిఐఒ రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి, రికార్డులన్నీ పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్, సిహెచ్‌ఒలు నారాయణ, జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వరూప, రమాదేవి, అంగన్వాడీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీసాయి వికాస్ స్కూల్‌పై చర్యలకు ధర్నా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేల్ మండల కేంద్రంలో ఉన్న శ్రీ సాయి వికాస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీ నరసింహులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజవర్గం చిట్వేల్ మండల కేంద్రంలో ఉన్న శ్రీ సాయి వికాస్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ హాస్టల్‌కు అనుమతులు లేకుండా కూడా ఉన్నాయని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోలోభాలకు గురిచేస్తూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి నిలువు దోపిడీ చేస్తున్నారని వాపోయారు. ఒక్క ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న విశ్వనాథనాయుడు శ్రీ సాయి వికాస్ ప్రయివేట్ స్కూల్ పెట్టి ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు దగ్గర చదువు చెప్పిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నా మండల విద్యాశాఖ అధికారి ఎందుకు పట్టించుకోవడంలేదు అని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక స్కూలుకు అనుమతి తెచ్చుకొని రెండు స్కూళ్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. తక్షణమే పాఠశాలపై సంపూర్ణ విచారణ జరిపించి వెంటనే ఆ పాఠశాల యాజమాన్యం పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు చంద్రకాంత్, జిల్లా నాయకులు మల్లికార్జున, ఉమేష్, సందీప్ పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే మామిడి పండ్లకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ తెలిపారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో రైతు చెంగల్‌రాయులు పండించిన మామిడి పండ్లకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించారు. మండలంలో మరో నలుగురు రైతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించే రైతులకు కూడా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లి డివిజన్‌కు మునీర, రాయచోటి డివిజన్‌కు పద్మావతి, రాజంపేట డివిజన్‌కు శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్2 స్వాతి, ఎల్3 అరుణ్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

మామిడి పండ్లను మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

మాసాపేట సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఇ రమణ

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి

- ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎస్.రమణ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా గడప గడపకూ మన మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కడప సర్కిల్ సర్వోన్నతాధికారి ఎస్.రమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో రాయచోటి డివిజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరా ఆలస్యంపై చర్చించారు. వినియోగదారులతో సమన్వయ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. 33/11 కెవి మాసాపేట సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. వేసవిలా తీసుకోవాల్సిన చర్యల గురించి కొత్తగా అమర్చిన 8.0 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. రాయచోటి పశ్చిమ విభాగానికి సంబంధించిన ఆఫీసును పరిశీలించి సిబ్బందితో రాయచోటి టౌన్‌లో అడిషనల్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, గడప గడపకూ మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులపైన త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తరువాత నారాయణరెడ్డి పల్లె దగ్గర కొత్తగా నిర్మిస్తున్న 33/11 కెవి సబ్ స్టేషన్ పరిశీలించారు. కార్యక్రమంలో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తిరుపాల్ నాయక్, చిన్నస్వామి నాయక్, రామచంద్రారెడ్డి, అన్ని మండలాల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రస్తుత సమాజంలో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు విద్య పేరుతో వ్యాపారం చేస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ, శ్రీ చైతన్య కళాశాల, పాఠశాలలో అడ్మిషన్ల పేరుతో అలాగే యూనిఫామ్ ,బుక్స్ పేరుతో అనేక రకాలుగా ఫీజులు వసూలు చేయడం మనం కళ్లారా చూస్తున్నామన్నారు. మదనపల్లి చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రైవేట్ కళాశాల, పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తామని చెబుతూ అనేక కోర్సుల పేరుతో మోసం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు వినయ్, కమలాకర్, బొప్పివెంకటేష్, ఓబులేసు, సురేష, నరేంద్ర, రాజు పాల్గొన్నారు.

ఎడికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విక్టరీ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కోడూరు నియోజకవర్గంలోని విక్టరీ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. గురువారం ఎడి నరసింహులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్టరీ విద్యా సంస్థలు ఫీజుల రూపంలోనేగాక పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. జీవో నంబర్ 1 ప్రకారం పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్ విక్రయించరాదనే నిబంధన ఉన్నప్పటికీ విక్టరీ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి విద్యార్థుల తల్లితండ్రుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ వేలాది రూపాయిలు వసూలు చేస్తున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖధికారులు జీవో నెం.1 పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు సామాన్య విద్యార్థులకు విద్యను అందని దాక్షలా తయారు చేస్తున్న తరుణంలో విద్య అందరికి అందించాలనే ఉద్దేశంతో ఫిజు నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చిందని, కార్పొరేట్ , ప్రయివేట్ శక్తుల చేతిలో కీలుబొమ్మగా మారినటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంల ఘోర వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రతి జిల్లాకూ డిఎఫ్ఆర్‌సి నియమించిన కమిటీలు కమిటీలకే పరిమితమయ్యాయే తప్ప ఎలాంటి మార్పు తీసుకురాలేదని మండి పడ్డారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేలుకొని జిల్లాలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలుపరిచి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి కార్యచరణ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయచోటి పట్టణ కార్యదర్శి నరేష్, మల్లికార్జున, కార్తీక్, రమణ పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

తంబళ్లపల్లి: ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ మహిళలకు అండగా నిలుస్తుంది. తంబళ్లపల్లెలో గురువారం దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దిశ యాప్‌పై పోలీసులు ఇప్పటి వరకు 120 మందికి పైగా యాప్స్ డౌన్లోడ్ చేయించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులు ఆపద సమయాల్లో దిశ యాప్‌ను వినియోగిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందని పేర్కొన్నారు. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రెడ్డెప్ప నాయక్, హెడ్ కానిస్టేబుళ్లు శంకర, గోపాల్, రవి నాయక్, రాజేష్, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వ్యవసాయ సాగులో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులను సాధించవచ్చని కలికిరి, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.ఎస్ పాండురంగ అన్నారు. గురువారం రెడ్డివారిపల్లి సచివాలయం వద్ద గ్రామంలోని రైతులకు సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు రైతులు వేరుశనగ పంటనుసాగు చేయడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. వేరుశనగలో విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. పంట తొలి దశలో మొదలు కుళ్ళు తెగులు, వేరు కుళ్ళు తెగులు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. వేరుశనగ పంటను ముఖ్యంగా ఆశించే తామర పురుగు, పచ్చ దోమ, పేనుబంక, పొగాకు లద్దె పురుగును నివారించే మార్గాలను రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శివకుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. సేద్య విధానం శాస్త్రవేత్త సోమశేఖరంబాబు మాట్లాడుతూ వరి, వేరుశనగ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, భాస్వరం, పొటాషియం తగిన మోతాదులో ఉపయోగించాలన్నారు. నానో యూరియా, నానో డిఎపి ఉపయోగించాల్సిన పంటలను వివరించారు. డాక్టర్ పీరుసాహెబ్ మాట్లాడుతూ సోలార్ కంచెను ఉపయోగించి అడవి పందుల నుంచి వేరుశనగ పంటను కాపాడుకోవచ్చని సూచించారు. టమాటా పంట సాగులో సూది పురుగు, ఆకు మడత తెగుళ్లను నివారించే పద్ధతులను రైతులు సమగ్రంగా ప్రయోగాత్మకంగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కెవికె వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శివకుమార్, సేద్య విధానం శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు, డాక్టర్ పీరు సాహెబ్, వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి, వ్యవసాయ సహాయకులు రెడ్డి కుమార్, రెడ్డి కుమారి, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త


సమావేశంలో మాట్లాడుతున్న పి.సురేంద్ర యాదవ్

నగరల సంక్షేమానికి చంద్రబాబు భరోసా

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడు వేదికగా టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రక్షణ చట్టం అమలు చేస్తామని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. పిటిఎం మండలం ఉప్పర వారిపల్లిలో బుధవారం జరిగిన నగర సోదరుల ఆత్మీయ సమావేశంలో రాజం పేట పార్లమెంట్ బిసిసెల్ అధ్యక్షులు పి.సురేంద్రయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరుల సంక్షేమానికి భవిష్యత్తుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ ప్రణాళిక ద్వారా బిసిలలో చైతన్యంతో పాటు నగర కులస్తులను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమం చంద్రబాబుతోనే సాధ్యం అవుతుందని అన్నారు. బిసిలను నమ్మించి నట్టేట ముంచిన జగన్, ఓటు బ్యాంకు కోసం నగరలను వాడుకుని గుర్తించకుండా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ నగర సాధికార కన్వీనర్ తాళ్ళ పాక వేణు గోపాల్, తంబళ్లపల్లి నియోజకవర్గం నగర కమిటీ అధ్యక్షులు కట్ట నాగరాజు, మావిళ్ల లక్ష్మీనారాయణ, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కట్ట హరి నాథ్, కృష్ణప్ప, చిన్నకేశవ, మావిళ్ల హరికృష్ణ, వెంకట రమణరాజు, దేవదాను, రాజశేఖర్, వెంకట రామయ్య, కట్టసరోజమ్మ వెంకటరమణ, బిసి విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి హామీ పనులను జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి పరిశీలించారు. మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామం లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఫీడల్ ఛానల్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను పెంచాలని, పనుల్లో నాణ్యతను పెంచాలని సూచించారు. పీడీ వెంట ఎపిఒ సురేందర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్‌అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ బాషా తనయుడు, వైసిపి యువ నాయకుడు షేక్ సద్దాం వివాహం గురువారం బి.కొత్తకోట పట్టణంలోని పిఎన్‌ఆర్ కళ్యాణమండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహానికి హాజరైన వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఆయన పలకరించారు. వివాహ వేడుకల్లో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్, వైసిపి యువనాయకులు కొండ సిద్ధార్థ, సచివాలయ కన్వీనర్ ఎస్.ఎస్. ఫయాజ్, భీమగాని ప్రభాకర్‌రెడ్డి, సబ్జి, కో-ఆప్షన్ మెంబర్‌నాసర్, పవన్, నక్కామహేష్, బోయవీధి మంజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నగర పంచాయతీ ట్రాక్టర్లు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ అభివృద్ధి కోసం పారిశుధ్య పనులకు ఇబ్బంది కలగ కూడదనే ఉద్దేశ్యంతో రాజం పేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ ఒడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మూడు ట్రాక్టర్లను మంజూరు చేయించారు. వీటి ద్వారా నగర పంచాయతీని శుభ్రపరిచేందుకు పారిశుధ్య పనులు చేసుకోవచ్చు. ఏప్రిల్ 22వ తేదీ నగర పంచాయతీలో ఆవరణంలో కొత్త ట్రాక్టర్లను అట్టహాసంగా ప్రారంభించిన సంగతి విదితమే. మూడు నెలలు కావస్తున్నప్పటికీ ట్రాక్టర్లను ఉపయోగించకపోవడంతో ప్రజలు నగర పంచాయతీకి అలంకరణ కోసం ఉంచారా అని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాక్టర్లకు ట్రాలీలు అమర్చి ఉపయోగములోకి తీసుక రావాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్లు

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాట వారిపల్లి పంచాయతీ శ్రీమాతమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో మహిళలకు ప్రతిఏటా చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లుగానే ఈ ఏడాది కూడా చీరలను పంచిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రవికుమార్, నాగరాజ, మాతంగ, రవి, గోపాల్, ఆదినారాయణ, వెంకటరమణ, సర్పంచ్ బరుగు రాధ, నాగేష్ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపిపి

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తోనే రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి శ్రేణులతో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా అందరం పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మినీ మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. ఓబుల వారిపల్లి మండలంలో 70 కుటుంబాలు, పుల్లంపేట మండలం నుంచి 80 కుటుంబాలు వైసిపి ముఖ్య కార్యకర్తలు టిడిపి చేరడం అభినందనీయమన్నారు. అనుబంధ కమిటీ సభ్యులు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

ఎస్ఐలతో మాట్లాడుతున్న సిఐ సాధిక్ అలీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం సిఐ సాధిక్‌అలీ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లు ఎల్లప్పుడూ ప్రజలకు రక్షణ నిలయాలుగా ఉండాలని, గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందితో క్రైమ్, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే వారికి అండగా ఉండి న్యాయం చేయాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యం, కోడి పందాలు, పేకాట స్థావరాల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాబోయే ఎన్నికలలో వర్గ పోరు లేకుండా చూడాలని తెలిపారు. సివిల్ కేసులలో పోలీస్ వారు ఎలాంటి జోక్యం చేసుకోరాదని సూచించారు. పెట్రోలింగ్ సిబ్బంది పాత నేరస్తులపై రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి కూడా సమయపాలన, క్రమశిక్షణ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ఎస్ గాయత్రి,డి రవీంద్ర, రామాంజనేయుడు, ఏఎస్ఐలు నజీర్ భాష, రెడ్డప్ప నాయక్ పాల్గొన్నారు.

భానుడి భగభగలు

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో భగభగ మండే ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ వేసవిలో రికార్డుస్థాయిలో ఎండలు ప్రజలను తారిక్షిస్తున్నాయి. గురువారం రెడ్డి పల్లె సెంటర్లో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. జూన్ రెండో వారం ముగింపు దశకు వచ్చిన ఎండలు మాత్రం తగ్గడం లేదు. రోహిణి కార్యం ముగిసి మృగశిర నడుస్తున్న వరుణుడు కానరావడం లేదు. దీంతో వేసవి తాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతేకాక వేసవి మధ్యలో కురిసిన అకాల వర్షాలు కొంత ఉపశయనం కలిగించిన వెనువెంటనే ఎండల తీవ్రత అధికమవడం జనం కొట్టుమిట్టాడుతున్నారు. రుతుపవనాలు మన రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మండే ఎండలు , వడగాల్పులు, అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండలతో వృద్ధులు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు మండే ఎండలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరి వర్షాలు ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నిర్మానుష్యంగా మారిన రెడ్డిపల్లె సెంటర్

ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

ఘనంగా శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లి ఎంపిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత అందరికీ ఆదర్శప్రాయుడైన గడికోట శ్రీకాంత్ రెడ్డి మరెన్నో పుట్టినరోజులు జరు పుకుని మరింత ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా సలహా మండలి సభ్యులు రవిరాజు, సర్పంచ్‌లు వెంకట నారాయణరెడ్డి, రమణయ్య, సిద్దక నాగిరెడ్డి, వెంకటరమణ, జనార్దన్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే దాన్ని ప్రజల వద్దకు చేర్చి ప్రజా నాయకుడిగా ప్రజల కోసం పరితపించే ప్రజా నాయకుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అని జిల్లా మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి అనంతరం భారీగా కేక్ కటింగ్ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని డిబిఎన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పిల్లలకు జగనన్న విద్యా దీవెన ద్వారా పుస్తకాలు, బ్యాగు, ఇతర విద్యా సామగ్రిని గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య అధ్యక్షతన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎంతో ప్రతిభ కలవారని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మక్కువ చూపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, చంద్రారెడ్డి, స్వర్ణలత పాల్గొన్నారు.

గంగమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని నిమ్మనపల్లి పంచాయతీలోని పెద్దమాదిగపల్లిలో గ్రామస్తులు నిర్వహించిన మాతమ్మ తల్లి గంగమ్మ జాతరలో గురువారం మదనపల్లి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి పాల్గొన్నారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ పురాతన హిందూ ఆచారాలను నేటికీ మనం పాటిస్తుండడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గంగ జాతరలో చాందిని బండ్లతో, జానపద నృత్య కళాకారులతో, బంధుమిత్రులతో, విందు వినోదాలతో కోలాహలంగా గంగ జాతరలు జరుపుకోవడం గ్రామాలలోని యువతకు ఐక్యంగా గుర్తిస్తారని తెలిపారు. గ్రామస్తులు ఏర్పాటుచేసిన ఉట్ల తిరుణాలను తిలకించారుకార్యక్రమంలో నాయకులు గడ్డం నరసింహారెడ్డి, ఎర్రయ్య, ఈశ్వర, కాసిం, రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ కృషి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబ సూర్యనారాయణ జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె పంచాయతీ నిధులు సరిగ్గా రాకున్నా పంచాయితీ పరిధిలోని ప్రజలకు ఎటువంటి తాగునీటి సమస్య లేకుండా, విద్యుత్ దీపాల సమస్య లేకుండా, ఎప్పటికప్పుడు చెత్తను సేకరించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇటువంటి జన్మదిన వేడుకలను మరిన్ని జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకులు శైలకుమార్, రమేష్‌రెడ్డి, పవన్, సుబ్రహ్మణ్యం, డేవిడ్ కళ్యాణ్ రాజ్, శివ, శివకుమార్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న క్రీడా పాఠశాల మండల స్థాయి ఎంపికలు

చింతకొమ్మదిన్నె : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలల్లో 2023 -24 విద్యా సంవత్సరానికి 4,5వ తరగతిల్లో ప్రవేశాల కోసం ఎంపికల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు . గురువారం మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4వ తరగతిలో ప్రవేశానికి 20 సీట్లు బాలికలకు 20 సీట్లు బాలురకు చొప్పున 40 సీట్లకు ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. కాగా గతేడాది 4వ తరగతి మిగిలిన 11 సీట్లకు (4 సీట్లు బాలికలు 7 సీట్లు బాలురు), ఈ ఏడాది 5వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారన్నారు. ఈ ఎంపికలు ఉదయం 8 గంటలకు చింతకొమ్మదిన్నె బయనపల్లి శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహి స్తామన్నారు. వివరాలకు 9866 431 633, 9908 78 3229లలో సంప్రదించాలని కోరారు.

పార్టీ కార్యకర్తను పరామర్శించిన అఫ్జల్‌ఖాన్

ప్రజాశక్తి - కడప

కడప నియోజకవర్గంలో ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న 27వ డివిజన్‌కు చెందిన పార్టీ కార్యకర్త ఆరిఫ్‌ను గురువారం వైసిపి కడప నియోజకవర్గ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. నిండు ఆయురారోగ్యాలతో కోలుకుని పార్టీ కి మరింత సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ కో- ఆప్షన్ సభ్యులు జహీర్, 27వ డివిజన్ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

హనీఫ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కలికిరి

ముస్లిం మైనార్టీ జెఎసి వ్యవస్థాపకుడు ఎంఐ హనీఫ్ పుట్టినరోజు వేడుకలను కలికిరి ఇందిరమ్మ కాలనీ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిఎంఐసి డైరెక్టర్ హరీష్ రెడ్డి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ముస్లిం మైనార్టీ జెఎసి ఆధ్వర్యంలో సభ్యులు భారీ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. హనీఫ్ సేవలు అభినందనీయమని , భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలలో ముస్లిం మైనార్టీ జెఎసి సభ్యులు, వైసిపి మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, గుట్ట పాలెం సర్పంచ్ వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి శ్రీకాంత్, నాయకులు వేంపల్లి ఖాదర్‌బాషా, అజయ్, వైసిపి, ముస్లింమైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

హనీఫ్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్న దాతలు

విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో పదవతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషికాన్ని కీ.శే. అరిగె పెద్దసుబ్బారాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కోడలు శ్రీరాం ప్రజావైద్యశాల స్కానింగ్ సెంటర్ అధినేత డా.రాంప్రసాద్ అరిగె, రిటైర్డ్ డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ కె.శ్రీవాణిలు గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతీ సంవత్సరం రూ.20వేలు నగదు పారితోషకం ఇవ్వాలని అనుకున్నా మన్నారు. మండలంలో అత్యున్నత మార్కులు సాధించిన పాటూరు జడ్పీ హై స్కూల్ విద్యార్థిని వి.సాయి కీర్తన, నందలూరు జడ్పీ హైస్కూల్లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని ఎస్.సంధ్య ఇద్దరికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున నగదు పారితోషకం జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ ఎన్.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రౌఫ్‌బాషా, శివశంకర్‌రెడ్డి, ఎన్ఎస్‌కె రెడ్డి, కృష్ణయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పాత కక్షలతో ఓవ్యక్తిపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచిన సంఘటన పిటియం మండలం, బూచిపల్లిలో బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. బాధితుడి సోదరుడు పలక నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ పాతకక్షలు, ఇంటి వివాదం కారణంగా అదే గ్రామానికి చెందిన వరుసకు చిన్నాన్న కొడుకులయిన పలక చంటి, పలక గణపతి, పలక శివన్న ముగ్గురు తమ ఇంట్లోకి చొరబడి మా తమ్ముడు ఆనంద్‌పై కర్రలు,రాళ్లతో దాడిచేశారని చెప్పాడు. ఈ దాడిలోమా తమ్ముడు తలపై తీవ్ర రక్తగాయం కావ డంతో మనదపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పిటిఎం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. తన తమ్ముడి పై దాడి చేసి గాయపరిచిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. పలక నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పిటిఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ ఆనంద్

ట్రాక్టర్ బోల్తా : పలువురికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కూలీలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా పడటంతో పలువురికి గాయాలైన సంఘటన పిటిఎం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం, మురుగమల్ల నివాసులు సుమారు 8 మంది వారి గ్రామం నుంచి కొక్కంటి క్రాస్ సమీపంలో మామిడికాయలు కోత నిమిత్తం కూలిపనికి వచ్చారు. కోత ముగించుకుని తిరిగి ట్రాక్టర్‌లో ట్రాలీపైన 8 మంది కూర్చుని శ్రీనివాసపురం మామిడికాయల మార్కెట్‌కు వస్తుండగా మార్గ మధ్యంలో పిటిఎం సమీపంలో గల ఎపి మోడల్ స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్ దగ్గర ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేష్ సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ అదుపుతప్పి ట్రాలీ ఎడమ వైపుకి పడిపోయింది. అందులో ఉన్న ఎనిమిది మంది వ్యక్తులలో ముగ్గురు వ్యక్తులకి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో నరసింహమూర్తి(30) నరసింహమూర్తి(26), నాగరత్నమ్మ(42)లు ఉన్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంపై పోలీసు విచారిస్తున్నారు.

తీవ్రంగా గాయపడ్డ నాగరత్నమ్మ

లారీ, ఆర్‌టిసి బస్సు ఢీ

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామపంచాయతీ రెడ్డిపల్లిపేట మలుపు వద్ద గురువారం మధ్యాహ్నం సమయంలో మినీ లారీ, ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బావికాడపల్లె నుంచి తిరుపతి వైపు వెళుతున్న అరటికాయల లోడు మినీ లారీని తిరుపతి నుంచి రాజంపేట వైపు వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ప్రమాదవశాత్తు ఎవరికి ఎటు వంటి నష్టం వాటిల్ల లేదని గ్రామస్తులు తెలిపారు. మినీ లారీ డ్రైవర్ తృటిలో పెద్ద బావిలో పడబోయి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

హత్య కేసులో ఏడుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

పట్టపగలే ఓ నిందితుడిని వేట కొడవళ్లతో అత్యంత కిరాతకంగా నరికి హత్య చేసిన ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా తెలిపారు. గురువారం కెవిపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన సమావేశంలో డిఎస్‌పి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. కెవిపల్లి మండలం, గాలివారిపల్లి పంచాయతీ, బొప్పసముద్రంలో ఈనెల 12న ఎం.గణేష్ అనే యువకుడిని పాత కక్షలు, భూ వివాదలను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడు, అతని బంధువులతో కలిసి గణేష్ కళ్ళలో కారం కొట్టి వేట కొడవళ్ళతో దాడి చేసి హత్యచేసి అడ్డొచ్చిన గణేశ్ తల్లి సరస్వతిపై కూడా దాడి చేసి, గాయపరచి, బొలెరో వాహనంలో పారిపోయారని అన్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రామంజులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కెవి పల్లి ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేశారన్నారు. ఎస్‌పి గంగాధరరావు ఆదేశాల మేరకు, డిఎస్‌పి మహబూబ్‌బాసా సూచనలపై కలకడ సిఐ పి.నాగేంద్ర, సిబ్బంది విచారణ జరిపి, కెవి పల్లి మండలం, తువ్వపల్లి పంచాయతీ, పెండేరివారిపల్లికి పడమర దిశగా సీతావుల గుట్ట సమీపంలో కొండేటి రాజేంద్రనాయుడు మామిడి తోటలో ఉన్న నిందితులు దామలచెరువు శ్రీనివాసులు నాయుడు(43), దామలచెరువు సాంబశివ నాయుడు(39), దామలచెరువు రామాంజులు నాయుడు(32), దామలచెరువు నాగరాజునాయుడు(26), దామలచెరువు తిరుపతి నాయుడు(52), దాముల చెరువు రెడ్డికళ్యాణ్ నాయుడు(30), దామలచెరువు సిద్దయ్య నాయుడు(76) లను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులైన దినేష్, ఆంజనేయులు పరారీలో ఉన్నారని త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని చెప్పారు. నిందితుల నుంచి హత్యకు వినియోగించిన మారణాయుధాలు, వారు పారిపోడానికి ఉప యోగించిన బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన సిఐ పి.నాగేంద్ర, కెవిపల్లి, గుర్రంకొండ, కలకడ ఎస్ఐలు లోకేష్, దిలీప్‌కుమార్, తిప్పేస్వామి, ఎఎస్ఐ మధుసూధనాచారి, హెడ్ కానిస్టేబుళ్ళ సురేష్, మస్తాన్, ప్రసాద్, కానిస్టేబుళ్ళ మోహన్ కుమార్, సుబ్బరాజ, డిబి వల్లీ, అర్జున్, పురుషోత్తమ్, తాతయ్యలను ఎస్‌పి, డిఎస్‌పిలు అభినందించారు.

పట్టుబడిన నిందితులతో డిఎస్‌పి, పోలీసు సిబ్బంది